"వాడికి పుట్టిన బుద్ధికాదు. ఎవరు పెట్టేరో పెంట!" అని చిన్న అనుమానం లేవదీసింది ఒక మెల్లకంటి ముత్తయిదువ.

"ఎవరో పెట్టే దేమిటే! ఏదో జరిగే వుంటుంది" అని ఖచ్చితంగా, ఇంకొక ఆమె చెప్పింది.

"పోనీ, వెళ్ళిపోయాడే అనుకో! వెళ్ళిపోతూంటే ఏదో బ్రతిమాలుకుని సముదాయించి ఆపుకోవాలి గాని, వూరు కుంటారా?" అని అంది ఒక పూర్వసువాసిని.

"బావుంది, బావుంది! ఇహ నదొక్కటే లేదను కున్నావా? అల్లుడు కారణం లేకుండా అలిగి వెళ్ళిపోతుంటే ఎవరయినా చూస్తూ వూరుకుంటారా? అందులో యిలాంటి సమయంలో. అవన్నీ జరిగాయట! ఎంత బ్రతిమాలుకున్నా అటువేసిన కాలు యిటు కదపలేదుట" అని ఒక వనిత ప్రత్యక్ష సాక్షిలా చూసివచ్చినట్టు చెప్పింది.

"పోనీ ఏమయినా కావలిస్తే యిచ్చుగుంటాం అని కూడా అన్నారట! కాని ఎంతచెప్పినా లాభం లేకపోతేనే వూరుకున్నారట!"

"పాపం! ఆడపిల్లగలవాళ్ళ మనసులు ఎంత క్షోభి స్తాయి అన్న యిదేనా వాళ్ళకి వుండదు కాబోలు!" అని అంది ఒక జాలిగుండెగల జలజాక్షి.

"బావుంది, మొగపెళ్ళివారికి పట్టుదలలూ పంతాలే గాని, పై సంగతులన్నీ వాళ్ళ కెందుకు? ఇలాటి వన్నిచోట్లా జరిగే అనవాయితీలే కదూ!"

"దేనికయినా సమయమూ, సందర్భమూ వుండొద్దూ

అనుకోలేదు. ఇంకా పాలుతాగుతున్నావా? జ్ఞానం వచ్చిన దానివి ఆపాటి తెలియొద్దూ?"

"... ..."

"మంచీచెడ్డా-కష్టం నష్టం ఆలోచించవద్దూ. ఎవరికి నష్టం అనుకున్నావు? అదృష్టం బావులేకపోతే ఎట్నుంచి ఏదివచ్చినా ఆజన్మాంతం నువ్వూ, నీతోపాటు మేమూ యేడ్వవలసిందేనా? యింకేమైనా వుందా?"

"... ..."

"మన మర్యాద మనం వుంచుకోవాలి. ఆమోజు అలాగే కాపాడుకోవాలిగాని ఇలా తెలివితక్కువగా ప్రవర్తిస్తే నీ బ్రతుకు యేమవుతుంది?"

"... ..."

"ఏది యెట్లైనా ఆడదానికే నష్టంగాని, మొగాడికేం!-ఈరోజునేకదా నువ్వంటే ఏమిటో, ఎటువంటిదానివో ఆయన తెలుసుకొని, ఒక అభిప్రాయానికి వచ్చేరోజు. అటువంటిది నువ్వు యిలా వున్నావూ అంటే, నీమొహం తిరిగిచూస్తాడా? నీకాపురం యేమవుతుందో ఇంత పిసరైనా ఆలోచించావా? నీ భర్తని సంతోషపెట్టడంకన్న వేరే యేముంది చెప్పు?"

"... ..."

"నిన్ను కంచి పెద్దదాన్నిచేశాం- ఏ లోపం యింత వరకూ రానివ్వలేదు. పువ్వులా ఎంతో ముద్దుగా పెరిగావు. ఈడురాగానే తగినవాణ్ణితెచ్చి నినొకి యింటిదాన్ని చేశాం!- నీ సంసారం నువ్వు దిద్దుకొని పుత్రపౌత్రాభి వృద్ధితో- సుఖంగా వుండాలనేకదా మా కోరిక. పుట్టింటి

